
"నాకు చాలా సంతోషంగా వుంది రఘూ. నేననుకుంటూనే వున్నాను... నువ్వు గొప్ప ఉద్యోగం సంపాదించి, దూరదేశాలకు వెళతావని, గొప్పవాడివైపోయి గొప్పగొప్ప పనులు చేస్తావనీ..." ఆనందంగా చెప్పాడు భూపతి.

రఘునాథరాజు నవ్వాడు. "ఏమి దూరదేశాలో, మన పల్లె ను, మీఅందర్నీ విడిచి పోవాలంటే మనసుకు ఎంతో కష్టంగా వుంది భూపతీ" అన్నాడు రఘు.

"అయినా నువ్విక్కడ ఎప్పుడున్నావు. ఏడేండ్లుగా చదువు కోసం పైవూర్లలో వున్నావే కాని ఈ పల్లెలో వున్నదెప్పుడు?" అన్నాడు భూపతి.



# సిహెచ్.వి. బృందావనరావు


# కొత్త స్నేహం

"చదువుకోసం ఎక్కడో వున్నది నిజమేగాని, నెలనెలా ఇంటికి వస్తూనేవున్నా గదా. మన వూరన్నా, ఈ వాగన్నా, ఈ చేలూ చెట్లన్నా, ఈ కొండన్నా నాకెంతో ఇష్టం. అందుకనే ఎక్కడ చదువుతున్నా నెలకోసారన్నా ఇక్కడి కొచ్చి, ఓ రెండురోజులు తప్పకుండా నీతో గడిపేవాణ్ణి గదా" అన్నాడు రఘు.

"నిజమే. కాని ఇప్పుడు ఆస్ట్రేలియాకు పోతున్నావు గదా. ఇక వీటన్నిటీ మరిచిపోవా ల్సిందే" అన్నాడు భూపతి.

"అవును" బాధగా అన్నాడు రఘు. "ఇప్పు డు ఏదో మాంద్యం వచ్చిందని ఉన్న ఉద్యోగాలే పోతున్నాయట గదా. నీకు కొత్తగా ఎట్లా వచ్చింది?" అడిగాడు భూపతి.

'దేన్ది దానికేలే. పొయ్యేవిపోతూనే వున్నా యి. వచ్చేవి వస్తూనే వున్నాయి. లక్షల సంఖ్యలో పోతుంటే వేల సంఖ్యలో వస్తూనే వున్నాయి. పాతవారికన్నా కొత్తవారు బెటరనుకున్నారేమో. నాకలా వచ్చింది" అన్నాడు రఘు.




సాయంత్రం అర యింది. ఆ పల్లెలో ఊరి బయట ఏటి వొడ్డున రెండు రాళ్లమీద కూచు ని, ఆ సాయంకాలపు చల్లగాలిని ఆస్వాదిస్తున్నారు రఘునాధరాజు, భూపతి. సన్నగా శబ్దం చేస్తూ గులకరాళ్లమీద దొర్లుకుంటూపోతున్నది వాగు. వాగవతల కని పించినంత మేరా పొలాలు. దూరంగా మేక లను మలేసుకుంటూ ఇద్దరు పిల్లలు ముచ్చ ట్లాడుకుంటున్నారు. కొంచెం దూరంలో చిన్న గుట్టలాంటి కొండ. కొండ నిండా పచ్చగా చెట్లు. ఓ పొలంలో రాత్రిపూట మేకల్ని కప్పి వుంచే వెదురుగూడు వుంది. పగలంతా ఆహా రం కోసం పోయిన పక్షులు ఒక్కొక్కటీ తిరిగి వస్తున్నాయి. చెట్లమీద గూళ్లల్లో పిట్టపిల్లలు ఆనందంతో రొదచేస్తున్నాయి. వాగుల్లో అక్కడ క్కడా కన్పించే చేపల కోసం, ఒకట్రెండు వెల్లంకి పిట్టలు తీరమ్మీద తచ్చాడుతున్నాయి.

రఘునాధరాజు ఆవూర్లో మోతుబారి రైతు పద్మనాభరాజు కొడుకు. వూరు చాలా చిన్నది. ఎక్కువమంది సన్నకారు రైతులు, కూలీలూ. అలాంటి ఓ రైతు కొడుకు భూపతి. భూపతి, రఘూ ఆవూరి స్కూల్లోనే కొంతకాలం కలిసి చదువుకున్నారు. రఘు పైచదువులకు పోయా డు. భూపతి పైచదువుల్లేకుండా, వూర్లోనే తండ్రికి వ్యవసాయంలో సాయంచేస్తున్నాడు. చదువుల్లో ఇద్దరికీ చాలా అంతరమున్నా, ఇద్ద రికీ ప్రాణస్నేహం మాత్రం వున్నది. ఒకరంటే

**జాగృతి కిరణ్ ఫౌండేషన్ (నాగపూర్) సహకారంతో నిర్వహించిన "హరిత కత - 2009" లో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ**

ఒకరికి పిచ్చి ఆపేక్ష. ఇద్దరికీ ఇంకా పెండ్లి కాలేదు.

'ఇంక నువ్వు ఆస్ట్రేలియా, అమెరికా, జపాన్ అంటూ తిరిగే వాడివేగాని ఈ పల్లెకు రావు గదా. ఒకవేళ ఈ దేశంలోనే వున్నా ఏ ఢిల్లీలోనో బెంగుళూర్లోనో వుంటావుగాని, ఈ పల్లె, మేమూ కనపడతామా నీకు?' అన్నాడు భూపతి.

జిల్లాలో ఓ కొసనవున్న చిన్నపల్లెటూరది. ఎప్పుడూ ఏ అధికార్లూ రారు.

"నిన్నూ, ఈ మట్టినీ, నా కుతికలో ఊపిరుండగా మరిచిపోగలనా" అన్నాడు రఘు.

భూపతి నవ్వాడు మిత్రుని ప్రేమకు కరిగిపోతూ. "ఐనా ఏమున్నాదీ వూళ్లో...? ఎంత శ్రమ పడ్డా ఫలసాయం బొటాబొటిగా వస్తుంది. కాలేజీ లేదు. వినోదానికి కేబుల్ టీవీ లేదు. మిగతా ప్రపంచానికి దూరంగా విసిరేసినట్లు ఉండాలి..." అన్నాడు భూపతి.

"బయటి ప్రపంచంలో ఏముందిరా ఉరుకులూ పరుగులూ తప్ప? అంతా కృత్రిమం. ఇక్కడ ఈ స్వచ్ఛమైన వాగునీళ్లు, ఈ పచ్చదనమూ, ఈ కొండల్లో చెట్లలో దొరికే ప్రాకృతిక ఫలసాయం, పుట్టతేనె, ఈ పైరగాలీ, ఈ పిట్టలు, గేదెలు, మేకలు, ఎడ్లూ వీటితో సహజీవనం ఎంత ఆరోగ్యంరా... ఇక్కడ మనూళ్లో ఎవరైనా ఎప్పుడైనా దీర్ఘవ్యాధులెరుగుదురా? మీనాయన్నే చూడు. దగ్గర దగ్గర అరవయ్యోఏడులో పడుతున్నా ఒక్క గుద్దుగుద్దితే బండల్ని నుగ్గు నుగ్గు చేస్తాడు. ఈపల్లెలో ప్రాణం ఎంతో హాయిగా వుంటుందిరా" అన్నాడు రఘు.

ఆ మాట నిజమే అన్నట్లు భూపతి తలూపాడు. ఇరవై మూడేండ్ల యువకుడు భూపతి. ఆజానుబాహుడు. కండల్తిరిగిన శరీరం. చామనఛాయ అయినా కష్టజీవి కాబట్టి కాంతితో మిలమిలా మెరిసే శరీరం.

"అన్నట్టు నువ్వు పెండ్లి చేసుకొని పోగూడదా ఆ ఆస్ట్రేలియాకు" అన్నాడు భూపతి.

"నాకింకా టయముందిగాని, ఏదమ్మ ఏమంటున్నది" అడిగాడు రఘు.

భూపతి కొంచెం సిగ్గుపడ్డాడు.

ఏదమ్మ భూపతికి వేలువిడిచిన మేనమామ కూతురు. ఏదమ్మవాండ్లు అక్కడికి ముప్పై మైళ్ల దూరంలోని మరో పల్లెలో వుంటారు. తల్లిదండ్రులకు ఏదమ్మొక్కతే కూతురు. వారు కూడా భూపతి వాళ్లలాగే సన్నకారు రైతులు. ఏదమ్మకు సంబంధాలు చూస్తుంటే భూపతిని తప్ప మరెవర్నీ చేసుకోనని తెగేసి చెప్పింది ఏదమ్మ. ఎట్టకేలకు సంబంధానికి అందరూ అంగీకరించారు. త్వరలోనే ముహూర్తాలు నిర్ణయించుకుంటారు. రఘు కూడా ఏదమ్మను చూసాడు. మిసమిసలాడే యవ్వనంతో, ప్రాకృతిక జానపద సౌందర్యంతో, అణువణువునా ఆరోగ్యంతో వుంటుంది. భూపతికి, ఏదమ్మకూ మంచి ఈడూ జోడూ అనుకున్నాడు రఘు.


"అయితే నాపెండ్లికి నువ్వుండవన్నమాట" నిష్ఠూరంగా అన్నాడు భూపతి.

"నేను వారం రోజుల్లో పోతుంటిని. ఈ వారం రోజుల్లో చేసుకోమరి" అన్నాడు రఘు.

"అట్టయితే ఆ పిల్లను రాత్రికి రాత్రే లేవదీసుకొచ్చేదా?" అన్నాడు భూపతి చిలిపిగా.

"నువ్వంత మొగోడివేగాని, మీ పెండ్లికి ఏం బంపమంటావు" అన్నాడు రఘు.

"నువ్వేంబంపితే మాత్రం, నువ్వు ఆటయములో నా పక్కనున్నట్టు వుంటుందా" అన్నాడు




భూపతి ఆపేక్షగా.

కనుచీకట్లు ముసురుకుంటున్నాయి. పక్షుల రొదలు ఎక్కువైనాయి. దూరంగా గుళ్లోంచి గంటల గణగణ శబ్దం సన్నగా వినిపిస్తున్నది. మిత్రులిద్దరూ లేచి, వాగులోకి దిగి కాళ్లు చేతులూ మొహమూ కడుక్కొని, రెండు దోసిళ్లు నీళ్లు త్రాగి వొడ్డెక్కి వూరివైపు కదిలారు.

*   *   *

రఘు ఆస్ట్రేలియాకు వెళ్లి మూడేండ్లు దాటిపోయింది. ఈలోపల రఘు మళ్లీ తన వూరికి రాలేదు. అతనెళ్లిన ఆర్నెల్లకు భూపతి, ఏదమ్మలకు పెండ్లి జరిగింది. నెలకోసారి రఘు భూపతితో ఫోన్‌లో మాట్లాడుతూనే వున్నాడు. ఇక్కడ లేడనే కాని తన తండ్రి ద్వారా తనవూరి సంగతులు తెలుస్తూనే వున్నాయి రఘునాధరాజుకు. ఒక పెద్ద బహుళజాతి సంస్థవారు ఏదో గొప్ప పరిశ్రమ పెట్టడానికి స్థలం కావాలని కోరితే, ప్రభుత్వం ఈవూరున్న ప్రాంతాన్ని ఆ సంస్థకు కట్టబెట్టింది. ఆ పరిశ్రమకోసం ఆ వూరును, ఆ చుట్టుపక్కల ఏడెనిమిది వూళ్లనూ ఖాళీ చేయించారు. కొంచెం డబ్బున్నవాళ్లు కాబట్టి పద్మనాభరాజు హైదరాబాదు చేరుకొని కొత్త వ్యాపారాలను మొదలుపెట్టుకున్నాడు. భూపతి తండ్రి రైతూ, కూలీకాని వ్యక్తి కాబట్టి ఏమిచేయడానికీ తోచలేదు. ఇల్లుపోయింది. పొలం పోయింది. ఊరువదలాల్సి వచ్చింది. పోయిన భూమికి నష్టపరిహారం ఇస్తానని ప్రభుత్వం తాత్సారం చేస్తున్నది. ఆఫీసుల చుట్టూ జనాన్ని తిప్పుకుంటున్నది. ఏదమ్మ తల్లిదండ్రులకు ఒక్కతే కూతురు కావటాన వారికీ తోడు నీడగా వుండొచ్చని భూపతి తన తల్లిదండ్రులతో సహా ఆ వూరుచేరి, అక్కడే వ్యవసాయం చేసుకుంటున్నాడు. భూపతికి ఒక కొడుకు. మరో కొడుకు పుట్టి, పురిట్లోనే చనిపోయినాడు. ఈ సంగతులన్నీ కొన్ని తండ్రి ద్వారాను, కొన్ని భూపతి ద్వారానూ తెలుసుకున్నాడు రఘునాధరాజు.

*   *   *

రఘుకి ఇంటి యావ ఎక్కువైంది. మళ్లీ


తన పల్లెకు పోవాలని, తన ప్రాణమిత్రుడైన భూపతిని కౌగిలించుకొని అతనితో నాలుగైదు రోజులైనా గడపాలని ఉవ్విళ్లూరుతున్నాడు. అంతేకాక తన పెండ్లి కూడా ఇప్పటికే ఆలస్య మైంది. ఓ నెలో, రెండు నెల్లో ఇండియాలోనే వుండి పెండ్లిచేసుకుని భార్యతో తిరిగి ఆస్ట్రేలియా పోవాలని అనుకున్నాడు. తన కార్యక్ర మాన్ని ఆ విధంగా ప్లాన్ చేసుకుని – ఫోన్లో భూపతికి తెలిపాడు రఘు.

'రాగానే రెండు రోజులు హైదరాబాదులో మా అమ్మానాన్నల్తో గడిపి వెంటనే మీవూరు వస్తాను' ఫోన్లో చెప్పాడు రఘు భూపతితో. ఇంత కాలం తర్వాత మిత్రుణ్ణి కలుసుకోబోతున్నానన్న ఆనందంతో రఘు రాకకోసం ఎదురుచూస్తు న్నాడు భూపతి.

*　　　*　　　*

మధ్యాహ్నం మూడు దాటింది. ఎండ ప్రచండంగా కాస్తున్నది. ఒంటి నిట్రాట పాక హెూటల్లో బల్లలమీద ఒకరిద్దరు కూచుని వున్నారు. దూరం నించి బస్సు శబ్దం వినిపించ గానే బల్లలమీద కూర్చున్నవాళ్లు లేచి నిల్చు న్నారు. మట్టిరోడ్డుమీద దుమ్మురేపుకుంటూ ఓ ఎర్రబస్ వచ్చి ఆగింది. బస్ ఆగగానే దుమ్ము ముందుకొచ్చి దిగే, ఎక్కే ప్రయాణీకుల ముఖాల్ని కమ్మేసింది. పక్కనే బురదలో పడుకున్న కుక్క లేచి మనుషులవైపు పరకాయించి చూసి ఒక్క సారి ఒళ్లు విదిలించుకుని అక్కడినించి వెళ్లిపో యింది. బస్సులోంచి దిగిన ఓ యువకుడు, దుమ్ముతెరలోంచి ఇవతలికి వచ్చి పాక దగ్గరికి రాబోతుండగా హెూటల్ లోంచి బయటకు వచ్చిన మనిషి అతని దగ్గరకు వచ్చాడు.

'భూపతిరాజా ఇల్లు ఎక్కడండీ' అని బస్ దిగిన వ్యక్తి అడుగుతూండగానే 'ఒరేయ్ రఘూ, నేనురా భూపతిని' అని పలకరించి, రఘు చేయి




శ్రీమతి పేకేటి గీతా శివరాం రచించిన "చిన్నమ్మ చిట్కాలు" గ్రంథాన్ని మానస ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్ శ్రీ త్యాగరాయ గానసభలో ఆవిష్కరిస్తున్న ప్రముఖ రచయిత డా॥ జి.వి. పూర్ణచందు. చిత్రంలో శ్రీయుతులు నర్సింగరావు, దీక్షితులు, గీత, నరసారెడ్డి, రఘుశ్రీ, సుబ్బారావు, సుశీల ఉన్నారు.

పట్టుకున్నాడు.

భూపతిని చూసి రఘు నిర్ఘాంతపోయాడు. తనకు తెలిసిన భూపతికీ – తను చూస్తున్న భూపతికీ పోలికేలేని స్థితిలో తను చూస్తున్నదె వర్నో నిర్ధారించుకోలేక 'ఏమిట్రా ఇది?' అన్నాడు రఘు. భూపతి బాగా పీక్కుపోయివున్నాడు. తల వెంట్రుకలు అక్కడక్కడా నెరుపుపట్టాయి. ఎదుర్రొమ్ము మీద ఎముకలు కన్పిస్తున్నాయి. శరీరపు రంగు పాలిపోయివుంది. పూర్తి ఆరోగ్యవంతుడూ, దార్ఢ్యమైన మనిషీ, యవ్వనంతో మెరిసిపోయే భూపతి ఈనాలుగేండ్లలోనే ఏమిటిలాగా ఐనాడో, ఎందుకైనాడో ఏమీ అర్థం కాలేదు రఘుకు. 'ఇంటికి పోదాం పదరా' అని భూపతి రఘు చేతిలోనిసంచి అందుకుని బయలుదేరదీశాడు. కండ్లకు కన్పించే వాస్తవాన్ని జీర్ణించుకోలేని రఘు, ఒక ప్రాణం మాత్రమే వుండి అన్ని చైతన్యాలూ ఉడిగిపోయిన మనిషిలాగా భూపతి వెంటనడుస్తున్నాడు. ఇంటికి చేరిన తర్వాత చూస్తే పరిస్థితి ఇంకా అధ్వాన్నంగా వుంది. ఆరోగ్యంతో నిగనిగలాడుతూ బండలను పిండిచేయగల చేవతో వుండే భూపతి తండ్రి మంచంపట్టివున్నాడు. తల్లి ఓ దయ్యం మనిషిలాగా మూలన కూర్చొని వున్నది. ఇక ఏదమ్మ – ఏదమ్మను చూడగానే కండ్లల్లో నీళ్లు పొర్లి వచ్చాయి రఘుకు. ఆ అందమూ, ఆ లావణ్యమూ, ఆ నిసర్గ ఆకర్షణ, ఆ యౌవనపు మిసమిసా – అన్నీ ఏనాటి ముచ్చట్లు అన్నట్లు అయిపోయింది.

'బాగున్నావా నాయనా' అని అడిగాడు భూపతి తండ్రి. 'కాళ్లు కడుక్కోన్నా...' అని పెద్ద చెంబుతో నీళ్లు తెచ్చిచ్చింది ఏదమ్మ. రఘు కాళ్లు కడుక్కొనివచ్చి, వాల్చిన మంచంమీద కూర్చుని, భూపతి అందించిన టవల్తో మొహం తుడుచుకున్నాడు.

"వారే భూపతీ, ఏందిరా ఇది. ఏందిరా మీరంతా ఇట్లా అయిపోయినారు. ఈ వూరెందుకు ఇట్లా అయిపోయింది. మనూర్లో పెద్ద పరిశ్రమ పెట్టారని విన్నాను. ఇక మనూరూ, దాని చుట్టుపక్కల వూళ్లూ మారిపోయి గొప్ప అభివృద్ధి జరుగుతుందని అనుకున్నాను. ఊళ్లకు వూళ్లే మాయమైపోయె. చుట్టుపక్కల వూళ్లు వల్లకాళ్లుగా మారిపోయె. స్థానికులందరికీ ఉద్యోగాలొస్తాయని, కార్మికుల కోసం మంచి కాలనీలు వెలిసి, వారికి స్కూళ్లూ, ఆస్పత్రులూ పెడతారని, వారందరి జీవితాలూ మారిపోయి, జీవనస్థాయి పెరిగి పల్లే లోకంగా వుండే జనానికి ఇతర ప్రపంచంతో సంబంధాలు ఏర్పడి – బ్రతుకుల్లో గొప్ప మార్పు వస్తుందని అనుకున్నాను. కానీ ఇదేమిట్రా ఇట్లా అయింది?" ఎంతో బాధతో అన్నాడు రఘు.

'అన్నిటికీ ఆ పరిశ్రమే కారణంరా. దాని కోసం వూళ్లు వూళ్లు ఖాళీచేయించారు. జనం తట్టాబుట్టా సర్దుకొని అలో లక్ష్మణా అంటూ తలో దిక్కుకూ పోయినారు. ఉన్నచోట్నించి కూకటివ్రేళ్లతో సహా పీక్కుని ఎవరికివారు వేరే చోట తమను తాము నాటుకోవడం అంటే ఎంత బాధో ఎవరికీ పట్టదు. పోయిన పొలాలకు, స్థలాలకూ నష్టపరిహారం ఇస్తామన్నారు. నాలుగేండ్ల నుండి ఆఫీసుల చుట్టూ తిప్పుతూనే వున్నారు. అదంతా ఒకెత్తు అయితే, ఈ కొత్త ఉపద్రవం సృష్టించిన పర్యావరణ విధ్వంసం మరో ఎత్తు. ఇదెంత భయంకరమైందో ప్రభుత్వం కాని, ఇతరులు కానీ ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. పరిశ్రమ వ్యర్థాలన్నీ వాగులోకి వదుల్తున్నారు. స్వచ్ఛమైన, తీయటి తేటనీట ఊట వాగు ఇప్పుడో దుర్గంధ భూయిష్టమైన మురుగు కాలవ. ఆ దుర్గంధం మైళ్లుమైళ్లూ కమ్ముకుంటుంది. వాగుపక్క కొండమీద ఇప్పు

డొక్క చెట్టుకూడా లేదు. అన్నిట్నీ నరికేశారు. ఫ్యాక్టరీ యంత్రాల శబ్దాలు రాత్రింబవళ్లూ జనం చెవులు బద్దలు చేస్తూ మైళ్లు మైళ్లు వినిపిస్తాయి. నిద్రుండదు. పక్కలమీంచి లేచేటప్పటికి మంచాలమీద ఇంత మందం దుమ్ము పరుచు కొని వుంటుంది. ఈ దుమ్ముతో, ఈ శబ్ద కాలుష్యంతో, ఈ మురుగుతో, ఈ దుర్వాసనతో, ఈ విషపుగాలితో సహజీవనం అలవాటై పోయింది. ఒక రోజా, రెండ్రోజులా – ఇది నిత్యతద్దినం. రోజులు గడిచేసరికి ఇదీ పరిస్థితి. ఈ భయంకర వాతావరణంలో ఎవరు మాత్రం బతికి బట్టగట్టగలరు...? మానాయన, ఎంత జబర్దస్తీగా వుండేవాడు. ఊపిరితిత్తులు చెడి పోయి మంచం పట్టినాడు. మా అమ్మకు కండ్లు కనిపించవు. ఇంక ఏదమ్మ – భూపతికి ఆమె పేరు తలిచేసరికి కంఠం రుద్దమైంది – ఎట్టుం డేది ఎట్టయిందో చూడు... నన్ను దప్ప ఇంకోణ్ణి చేసుకోనని వాండ్ల నాన్నతో కొట్లాడి వచ్చింది. దానికి నేనేం జేసినాను? ఆఖరికి ఈ విషపు గాలికి – పుట్టిన బిడ్డగూడ రోగంతోనే పుట్టి – పుట్టంగానే పాయ. మంచి గాలి లేదు, మంచి నీరులేదు. అనునిత్యం దుమ్ము – మురుగు. ఓ చెట్టు లేదు. మొక్కనాటితే బతుకదు. బతికితే ఎదగదు. ఊళ్లో ఎవరి మొహంలో కూడా జీవకళ లేదు. ఈ వాతావరణం అలముకున్న ఈచుట్టు పక్కల పదూళ్లూ ఇట్లానే వున్నాయి. పరిశ్రమలు పెట్టాం, అభివృద్ధి చేశాం అంటూ ప్రభుత్వం పేపర్లల్లో టీవీల్లో ఊదరగొడతానే వున్నది. కానీ మనుషుల బతుకుల పరిస్థితి మాత్రం – ఇదుగో నువ్వు చూస్తూనే వున్నావు గదా. మనుషులే గాదు. నోర్లేని మూగజీవాలు పశువులు కూడా అలానే వున్నాయి!" అంటూ ఎంతో బాధతో వివరించాడు భూపతి.

"సరేలే, మన నొసట దేముడిట్లా రాసాడు. ఏం చెయ్యగలం" – అన్నాడు భూపతి తండ్రి.

"దేముడు రాయలేదు. మనుషులే రాసారు. మనమే దాన్ని మార్చుకోవాల" అన్నాడు రఘు.

"అవన్నీ అయ్యేవేనా. పోనీలే, నువ్వెన్ని రోజులుంటావు ఇండియాలో. నీ పెండ్లి సంగ తేంది" అడిగాడు భూపతి.

"ఏదీ, రాగానే ఇక్కడికి వస్తిని. రేపు ఇంటికి పోయి వివరంగా ఆలోచించుకోవాల" అన్నాడు రఘు తను మిత్రుని కోసం, అతని కుటుంబ సభ్యులకోసం ఆస్ట్రేలియా నుంచి తెచ్చిన వస్తువులు సంచిలోంచి బయటకు తీస్తూ.


*　*　*

"మంచి సంబంధం ఒకటి చూసి పెట్టున్నా. పెండ్లి చేసుకొని, భార్యను తీసుకుని పోదువు గాని. శలవు ఎన్నిరోజులు పెట్టావు" అడిగాడు పద్మనాభరాజు కొడుకు రఘును.

"నాన్నా నేను మళ్లా ఆస్ట్రేలియా పోవడం లేదు. ఉద్యోగం కూడా చేయదల్చుకోలేదు. మనకున్నది మనకు చాలు" అన్నాడు రఘు.

ఆశ్చర్యపోయిన పద్మనాభరాజు "అయితే ఏంచేద్దామనుకుంటున్నావు?" అడిగాడు. లోప ల్లోపల అతనికి సంతోషంగా వుంది. ఒక్కగా నొక్క కొడుకు అంతదూరం పోవడం అతనికీ ఇష్టంలేదు. ఇక్కడే వుండి తన వ్యాపారాలు చూసుకోవచ్చని అతని అభిప్రాయం.

"నాన్నా, నా ఉద్దేశ్యం నీకు చిత్రంగా అని పించవచ్చు. కానీ నేను గట్టి నిశ్చయం చేసుకు న్నాను. దేశంలో పర్యావరణ విధ్వంసం జరుగు తున్నది. వాతావరణ కాలుష్యం అన్ని పరిమి తులూ దాటిపోతున్నది. నీరు కలుషితమైంది. ఏ నది చూసినా మురుగుతప్ప మరేమీ లేదు. గాలి కలుషితమైంది. శుభ్రమైన గాలి లేదు.




ఫ్యాక్టరీల పొగ, వాహనాల పొగా గాలినిండా నిండిపోయాయి. ఇక నేల సంగతి ఎట్లావున్నది. ఎక్కడైనా త్రవ్వు... ప్లాస్టిక్కాగితాల పీలికలు నేలమీదా – నేలలోపలా. ఈ కాలుష్యాలకు వాతావరణం వేడెక్కి, ఆకాశపు ఓజోన్ పొర కూడా చిల్లులు పడిపోతున్నదట. పృథ్వి, నీరు, గాలి, నింగీ – ఇలా మనిషి బ్రతుక్కు అవసరమైన పంచభూతాలను మనిషే నాశనం చేసుకుంటూ, తన వునికికి తనే ప్రమాదం తెచ్చుకుంటున్నాడు. నేను వాతావరణ కాలుష్యానికి వ్యతిరేకంగా పనిచేద్దామనుకుంటున్నాను. జనంలో దీన్ని గురించిన అవగాహన కలిగిస్తాను. ప్రజల్ని సమీకరిస్తాను. పర్యావరణ పరిశుద్ధత గూర్చి వివరిస్తాను. పెద్దలచేత ఉపన్యాసాలిప్పిస్తాను. సెమినార్లు పెట్టిస్తాను. ఈవిషయంమ్మీద కవుల చేత కవిత్వాలు రాయిస్తాను. రచయితలచేత వ్యాసాలూ, కథలూ రాయిస్తాను. డాక్యుమెంటరీలు తీయించి ప్రదర్శింపజేయిస్తాను. నాలాగా ఆలోచించే జనాన్ని పోగుజేసి, దీన్నొక ఉద్యమంగా ముందుకు తీసుకెళతాను.

ఇదొక యుద్ధం. ప్రపంచయుద్ధాలను మించిన యుద్ధం. ఇంతకుముందు జరిగిన యుద్ధాలు – రాజ్యాల కోసమూ, అధికారం కోసమూ జరిగాయి. కానీ ఇది మనిషి మనుగడకోసం జరిగే మహాయుద్ధం. దీనికి ప్రతివ్యక్తీ ఓ సైనికుడు కావాలి. ఆ చైతన్యం కలగడంకోసం నాలాగా ఆలోచించే యువకులను సమీకరించి కృషిచేస్తాను. ఈ ఉద్యమంకోసం ఓ కొత్త సైన్యాన్ని తయారుచేస్తాను. మొదలుపెడితే చాలామంది ముందుకొస్తారనే నమ్మకం నాకుంది. ముందు భూపతి కుటుంబాన్ని ఇక్కడికి తీసుకువచ్చి మంచి వైద్యం చేయించాలి. ఆ తర్వాత భూపతిని కూడా ఈ ఉద్యమంలో చేర్పిస్తాను. ఇవన్నీ కేవలం ఉద్రేకంలో చెపుతున్న మాటలుకావు. నేనూ భూపతీ కలిసి తీసుకున్న నిర్ణయాలు" అన్నాడు రఘు.

ఒక కొత్త స్ఫూర్తితో మాట్లాడుతున్న కొడుకు వైపు ముచ్చటగా చూస్తుండిపోయాడు పద్మనాభరాజు.